కథానిక

# తీరని అశాంతి

టేకుమళ్ల కామేశ్వరరావు

పొద్దుటిపూట వాలుకుర్చీమీదకూర్చుని ఆరోజు దినపత్రికచదివేడు ధనశీలరావు. ఇక స్నానానికి లేద్దామనుకొని పత్రికనుమడతపెడుతున్నాడు. ఎదుటివాటాలో సావిట్లో చంటిపిల్లను బుజం మీదవేసుకొని పచారు చేస్తున్నాడు మారుతిమూర్తి. అతన్నిచూసి ధనశీలరావు"ఏమండోయ్ బావగారూ! మళ్ళీ అంటుకొంది కొరియా యుద్ధం"అన్నాడు.

"ఉఁ ఉఁ! అందుకనేకాబోలు పొద్దున్న బజారుకెళ్ళి అడిగితే రోజూ కానీకి ఇచ్చే తోటకూర అర్ధణాచెప్పింది!"అన్నాడు మారుతిమూర్తి.

"వీళ్ళుకూడా నేర్చుకొన్నారులెండి, ఉల్లిపాయలింతఖరీదుగా ఎందుకున్నాయయ్యా పావుకారూ అంటే కొరియాయుద్ధముండి బాబయ్యా అనడం! ఈ వస్తువులన్నీ కొరియాకి ఎగుమతయి పోతూన్నట్లుగానే మాట్లాడతారు."

"అన్నివిధాలా కాలం మండిపోతూంది" అన్నాడు మారుతిమూర్తి చిరాకుతో.

"వెనక 1914 లో యుద్ధం వచ్చిందంటే ఏ బియ్యమో, ఏ కిరసనాయిలో ఖరీదయేయికాని ఇప్పటిలాగు ఇటికలదగ్గరనుంచి, మట్టిదగ్గరనుంచి ధరలు పెరిగిపోలేదు"అన్నాడు ధనశీలరావు.

"రెండోప్రపంచయుద్ధం ముగిసి అప్పుడే ఏడేళ్ళయినా, ఇంకా ఇంతింత ఖరీదులేమిటో చెప్పు దురూ అయినా"అన్నాడు మారుతిమూర్తి.

"ఏమిటోమరి! తగ్గుతాయి తగ్గుతాయంటున్నారు ప్రభుత్వాధికారులు."

"అంతేకాని, తగ్గడం మనకంటికి కనబడదు. ఇప్పటి ఆర్థికస్థితి, నైతికస్థితి తలుచుకొంటే ఒళ్లు గగుర్పొడుస్తూంది. ఇది బాగుపడడానికి వచ్చినట్లుగా కనబడదు. ఒక్కమానవుడినోటా నిజం రాదుకదా"అన్నాడు ధనశీలరావు.

"మనం ఎక్కడికిపోతున్నామో ఏమిటోతెలియకుండా ఉంది. కలికాలమహత్యం. అంతా మాయలాగుంది"అన్నాడు మారుతిమూర్తి.

ఆఫీసుకివెళ్లేతొందరలో ఇద్దరూ సంభాషణ ముగించేరు.

ఆ ఇద్దరు స్నేహితులుకూడా వేర్వేరు ఆఫీసులలో పనిచేస్తున్నారు. ధనశీలరావు ఒక మందుల షాపులో మేనేజరుగా ఉంటున్నాడు. నెలకి రెండువందలిస్తారు. మారుతిమూర్తి ఒక పెద్ద తోళ్ళకంపెనీలో గుమాస్తా. నెలకి డెబ్భై తెచ్చుకొంటాడు. ధనశీలరావు ఇల్లంతా అద్దెకితీసుకొని దానిలో ఒక చిన్నవాటా మారుతిమూర్తికి అద్దెకిచ్చేడు.

మారుతిమూర్తి భోంచేస్తూండగా పంకజమ్మ అంటే అతని భార్య "పిల్లాడికి పాలపొడిడబ్బా అయిపోయింది"అంది.

"అప్పుడే?"అన్నాడు భర్త, అర్థంలేనిమాట అని తెలిసికూడా.

"అప్పుడేమిటి! ఎప్పటిలాగే పదిహేను రోజులువచ్చింది"అంది భార్య.

"కొత్తడబ్బాతేవడానికి డబ్బెక్కడిది" అని మారుతిమూర్తికి గుండెలలో రాయిపడింది.

"ఇంటిలో నెయ్యికూడ నిండుకొంది" అంది ఇల్లాలుచల్లగా.

మారుతిమూర్తికి చెవులు గడియలుపడ్డట్టుగా తోచింది. "అప్పుసప్పు ఎంతకనిచెయ్యను, ఎక్కడతేను?" అన్నాడు.

"పోనీ ధనశీలంగారిని అప్పడగండి."

"ఇదిగో, అప్పు అనగానే మాటలను కొంటున్నావు కమోసు! సకాలానికి చెల్లించకపోతే ఉండే పరపతికూడ పోతూంది. పైగా తెలిసిన వాళ్ళదగ్గిర పుచ్చుకొంటే మనగుట్టలుకూడ బయలుదేరతాయి కాబట్టి ధనశీలంగారితో మనం జగడం తెచ్చుకోదలుచుకొంటే అప్పు అడుగుదాం పద!" అన్నాడు భర్త.

"మీ ప్రొప్రయిటరుపై ఉద్యోగంలో వేస్తానంటున్నాడు అన్నాడు?"

"ఆమాట ఇప్పటికి అయిదేళ్ళనుంచి చెప్తు తున్నాడు. అంతుపొంతు కనబడదు."

"పోనీ జాతక మొకసారి చూపించుకోండి."

"ఇప్పటికి ఎన్ని సార్లు చూపించుకోలేదు. జాతకంలో మీకు మంచి రోజులండి. అని అంటూనే ఉంటాడు. మనం చెడ్డరోజులు అను భవించిపోతూనే ఉంటాము."

"ఏమిటో మీ మాటలు! కాని అతను చెప్పి నట్లుగానే మీరు పాతికరూపాయల మనిపర్సు బజారులో పారేసుకురాలేదూ?"

"పైగా జాతకం చూపించుకొన్నప్పుడెల్లా రెండురూపాయలు దర్శించుకోవాలి."

భోంచేసి మారుతిమూర్తి దడబిడగాలేచేడు. వేషం వేసుకొని గజిబిజి మనస్సుతో ఆఫీసుకి పరుగెత్తేడు.

పంకజమ్మ భోంచేసి తీరుబాటుగా కూర్చుంది. ధనశీలరావు భార్య రత్నావతికూడా భోంచేసి తాంబూలం బిగించి, రేడియో తిప్పింది.

"ఇవాళ మనస్సులో మనస్సులేదు మా వారికి.'' అంది పంకజమ్మ.

"ఏమమ్మా? ఎందుచేత?" అని విన కుతూ హల పడింది రత్నావతి.

"ఏమని చెప్పమన్నారు వదినగారూ! అంతా నానా బజారుగా ఉందంటే నమ్మండి. పిల్లాడికి పాలపొడి డబ్బా తెమ్మంటే చేతిలో డబ్బు లేదంటారు. ఇవాళ ఇంకా పదిహేనో తారీఖా! మరి పదిహేనురోజులు గడవాలి. ఎలాగ గడు స్తాయో చెప్పండి?"

"అందరం అలాగే ఉన్నామమ్మా. ఆ ఒకటో తారీఖు నెలకి రెండుసార్లేనా రాదు దానిఇల్లు బంగారం కాను!"

"ఏమిటోనండి వదినగారూ! వెర్రెత్తిపో తూంది. వచ్చేవి డెబ్భైరూపాయలు! ఎన్నిటికని వస్తాయో చెప్పండి? పాతికరూపాయలు ఇంటి అద్దెకే పోతాయికదా? పాలకి, కాఫీకి-అదైనా ముక్త సరిగా రోజుకి ఒక్కపూటే కక్కూర్తి పడితే పదిహేనురూపాయలు మింగేస్తున్నాయి. మిగతా ముప్ఫై ఎన్నిటికనివస్తాయో చెప్పండి. అప్పటికీ నెయ్యి చూసిచూసి వేసుకొంటున్నాం. కూరగాయలు చవకరకాలే కొనుక్కొంటున్నాం. వాడుకచీర మరొకటిలేక, కొనుక్కొందామని రెండు నెలలనుంచి ఆలోచన! ఇప్పటికి తెగ కుండా ఉంది. ఇలాగుండగా చిల్లర అప్పులు వెంట కుప్పల్లాగు పెరుగుతూ న్నాయి. ఏమిటో ఏమీ తోచకుండా ఉంటుందండి వదిన గారూ!" అంది పంకజమ్మ.

"మా సంగతి ఎవరితో చెప్పుకోము తల్లీ! మీ కంటె కాస్త ఎక్కువ తెచ్చుకుంటున్నా మన్న మాటేగాని కర్పూరంలాగు హరించిపోతూంది. ఇంటి అద్దె ఏభై కదా! పాలకి, కాఫీకి ముప్ఫై తగలేస్తున్నాము. మళ్ళీ ఫలహారాలకివేరే నెలకి పదిహేనవుతూంది. ఎంత పథ్యంగా తింటున్నా డాక్టర్లకి పోసేది పోసేదే! మిగతా ఖర్చులు తప్పేదిలేదు. నిత్తెవాడుక్కి పట్టుచీర లేదని మొరపెట్టగా పెట్టగా నిన్న పట్టుకొచ్చేరు. దీని మొహాన్ని నలభైపెట్టవలసి వచ్చింది. ఈరేడియో ఒకటి ఉండక తీరదుకదా! అరువందలు దీని పొట్టను పెట్టుకొంది. అదైనా వాయిదాలమీద చెల్లించే పద్ధతినే తెచ్చేరులెండి. పాపం. లేక పోతే చేతిలో రొక్కం ఎక్కడ ఏడిసింది? మన మందరం ఒక్క ఇంటిలో ఉన్నందుకు ఒక్క మోస్తరుగానే అవస్థలు పడుతున్నాంలెండి." అంది రత్నావతి.

"ఏదయినా డెబ్బయి రూపాయలు దేనికి సరి పోతాయండి వదినెగారూ? వీటిలో ఏదితగ్గించు కోడం? తిండి తగ్గించుకోమన్నారా? పనిమనిషిని పెట్టుకోవద్దంటారా? చాకలివద్దంటారా? అప్ప టికీ సినిమాలకి, నాటకాలకి, పాటకచ్చేరీలకి తిర గడమే లేదుకదా?"

"ఎంతచెట్టుకి అంతేగాలమ్మా.'' అంది రత్నా వతి.

"కూటికి గుడ్డకి చాలని ఈ ఉద్యోగం మన కెందుకు మరొకటేదేనాచూసుకోండని శతపోరు పెడుతున్నాను. అదేమి మొండితన మోకాని ఆయన చెవినిపెట్టకుండా ఉన్నారు"అంది పంక జమ్మ.

"ఏ ఉద్యోగమైనా పొట్ట పోషించుకోటా నికే కదా? అదికాకపోతే దానితాత మరొకటి!" అంది రత్నావతి.

తమలపాకుల మనిషి, పూల అమ్మి వాడు కగా ఇచ్చిపోయేవాళ్లు వీధి గుమ్మందగ్గర కేకలు వెయ్యగా రత్నావతి లేచివెళ్ళి తిరిగివచ్చి. కదం

బంలో ఒక ముక్క తెంపి పంకజమ్మకి కూడా ఇచ్చింది.

ఏదో మరి కొంత బాతాఖానీ వేసుకొన్నారు.

"ఈ బాధలు ఎప్పుడూ ఉండేవేకానిలెండి వదినగారూ! కొత్త ఫిల్ము వచ్చి వారం రోజు లయిందిట. ఇంతవరకు ఒక్కసారేనా చూడ లేదు. సాయంత్రం ఆటచూసి వద్దాం పదండి" అంది రత్నావతి.

"కానియ్యండి! దీనివల్ల వచ్చేదీలేదు పోయేదీ లేదు. రేపటిమాట ఎవరు చూడవచ్చేరు. 'చెడ్డ కాపరానికి ముప్పేమిటి చంద్రకాంతాలు వండే పెళ్ళామా అంటే అయిన అప్పుకి అంతమేమిటి అవే వండుతానురా మగడా' అందిట!" అంది పంకజమ్మ.

రత్నావతికి నవ్వు వచ్చింది.

స్నేహితురాళ్లిద్దరూ సినిమాకివెళ్ళేరు. భర్తలు పొద్దుపోయి ఇంటికివచ్చేరు. కాని ఇంటికితాళం వేసి ఉంది. రెండో తాళంతో తీశారు. సినిమాకే వెళ్ళి ఉంటారనుకొన్నారు. ఏవేవో కబుర్లుచెప్పు కొన్నారు. ఇంతటిలో సంభాషణ ఇంటి ఖర్చుల మీదికి తిరిగింది. మారుతిమూర్తి తన భార్య వట్టి దూబరా మనిషి అనీ, పొదుపంటే యెరగదనీ తేల్చేడు. ధనశీలరావు తనభార్య చేసే ఖర్చులకి అర్థంపర్థం లేదనీ, చెప్పినావినదనీ విచారించేడు. ఇంతటిలో అర్ధాంగులు ఇంటికి హాజరయేరు.

పంకజమ్మ ఇంటిపనితో హడావిడిపడుతూం డగా మారుతిరావు కోటుతీసి కొక్కెమునకు తగి లిస్తూ "శుభవర్తమానం తెచ్చేనేవ్"అన్నాడు.

"ఏమిటేమిటి?" వినడానికి తొందరపడింది ఇల్లాలు.

"నువ్వు రోజూ నూరిపోస్తూన్న ట్లే చేసుకు వచ్చేనుమరి!"అంటూ ఉత్సాహపడ్డాడు మారుతి మూర్తి.

"అది ఏమిటని?"

"మా మేనేజరుని ఇవాళ నిలవేసి అడిగేను 'ఏమండీ మేనేజరుగారూ! మీరు ఇప్పటిలో నాపై హోదాఇచ్చేది ఏమేనాఉందా లేక ఉట్టి మాటలేనా' అని. ఆయననీళ్ళు నములుతూంటే 'ఉన్న సంగతేదో బైటపెట్టండి! ముసుగులో గుద్దులాటవద్దు' అన్నాను. "నాకేమీ నమ్మకం లేదు అబ్బాయీ! నిన్ననే నీసంగతి ప్రొప్రయి టరుదగ్గిర ఎత్తేను. ఆయనేమీ ఆశాజనకంగా మాట్లాడలేదు"అన్నాడు. అయితే గుడ్ బైకొట్టే స్తున్నాను అంటూ రాజీనామాకాగితం ఆయన చేతిలోపెట్టేను. పాపం! ఆయన చాల విచారిం చేడు. కాని ఎమిచేస్తాడు! ఇది ఇలాగుండగా— నేను ఇదివరకునుంచీ నీకు చెప్పతూన్న మరో ప్రొప్రయిటరు దగ్గరకి వెళ్ళేను. ఆయన ఎప్పుడైనా యిస్తానన్నాడు. వెంటనేచార్జీ పుచ్చుకొన్నాను" అంటూ చంకలు గుద్దుకొన్నాడు.

పంకజమ్మ మొహం వికసించింది "మరొక పదిరూపాయలు వస్తూంటే ఎవరు పోగొట్టు కొంటారండీ." అంది.

పదిరోజులు గడిచేయి. మారుతిమూర్తి ఇంటికి ఒకరోజున వెనకటి మేనేజరు వచ్చేడు. "ఏమయ్యా మారుతి మూర్తీ! మరి మా ప్రొప్రయిటరు మొన్ననే గుమాస్తాలందరికీ నూట ఇరవై రూపాయలు చేశాడు. నువ్వు మళ్ళీ వెనక్కి వస్తావేమిటి? ఏదో కాళ్ళు కడుపులు పట్టుకొని బతిమాలుకొందాం" అన్నాడు.

మారుతి మూర్తి నిర్ఘాంతపోయేడు.

"ఏమంటావు?" అన్నాడు మేనేజరు.

"మావాళ్ళ నడిగి మీకు మళ్లీ కబురు తీసుకు వస్తానండి." అని అప్పటికి తప్పించుకొన్నాడు.

మేనేజరు వెళ్ళిపోయేడు.

మారుతిమూర్తి లోపలికివచ్చి భార్యతో, మేనేజరు చెప్పినదంతా చెప్పేడు.

పంకజమ్మకి ఏడుపువచ్చింది.

"ఏమంటావు?"అన్నాడు భర్త.

"మీ యిష్టం"అనిమాత్రమే అని ఊరుకొంది.

"మళ్ళీ ఆ ప్రొప్రయిటరుని చూడడానికి నాకు మొహం చెల్లకుండా ఉంది. రాజీనామా కాగితం అందించి మళ్ళీ ఏ మొహంపెట్టుకొని వెళ్ళను?" అన్నాడు.

మూతి బిడాయించుకొంది ఇల్లాలు.